క్లుప్తంగా

750 మందికి వైద్యసేవలు



వ్యక్తిగత శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 750 మంది రోగులకు పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్య సేవలు అందించారు. అలాగే గ్రామంలో మంచంపై ఉన్న రోగుల ఇంటికి నేరుగా వెళ్లి వైద్యం చేశారు. వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్వరూప, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఏఎన్‌ఎంలు మున్నీషా బేగం, సలీమా, ఆశవర్కర్లు జ్యోతి, సత్యవతి, కుమారి పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి విరాళాల సేకరణ



గోకవరంలో బాలుడి వైద్యానికి విరాళాలు సేకరిస్తున్న దృశ్యం

గోకవరం: అరుదైన సీజీడీ వ్యాధితో బాధపడుతున్న గోకవరానికి చెందిన రెండున్నరేళ్ల బాలుడు సత్యశ్రీ అక్షయ్‌రామ్ వైద్యం కోసం సోమవారం విరాళాలు సేకరించారు. వారపు సంత కావడంతో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు ఆధ్వర్యంలో షాపుల వద్దకు వెళ్లి బాలుడి పరిస్థితి గూర్చి వివరించి దాతల సహాయం కోరారు. దీనిపై పలువురు వ్యాపారస్తులు ముందుకు వచ్చి సుమారు రూ.40 వేలు వరకు విరాళాలు అందించారు. ఈ సందర్భంగా బోసుబాబు మాట్లాడుతూ బాలుడి వైద్యానికి రూ.30 లక్షల వరకు ఖర్చవుతుందని, ఇప్పటి వరకు వివిధ వర్గాలకు చెందిన దాతల ద్వారా రూ.9 లక్షలు సమకూరాయన్నారు. ప్రభుత్వపరంగా బాలుడిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఎస్ఎస్ ఆలీషా తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వం వికాసంపై విద్యార్థులకు అవగాహన

పెదపూడి: మండలంలోని పెదపూడి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద వ్యక్తిత్వం వికాసంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం పాఠశాల వద్ద సెట్రాజ్ కాకినాడ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ కె.హైమాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. విద్యార్థి దశ నుంచి వ్యక్తిత్వ వికాసం మెరుగుపరచుకుంటే ఉన్నత శిఖరాలు సాధించగలరని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారిజాత గిరి ప్రదక్షిణ

రాజానగరం/మధురపూడి: మాఘ పౌర్ణమి సందర్భంగా కోరుకొండలో శ్రీలక్ష్మీనరసింహుడు కొలువైన పారిజాత గిరి ప్రదక్షిణ సోమవారం సాయంత్రం వైభవంగా జరిగింది. దివాన్‌చెరువుకు చెందిన దేశ సంచార యాత్రికుడు పెన్నాడ మోహన్ సారథ్యంలో కొందరు భక్తులు బైకులపై కోరుకొండకు చేరుకున్నారు. సుమారు మూడు కిలోమీటర్లున్న పారిజాత గిరి చుట్టూ నమో నారసింహాయ అంటూ ప్రదక్షిణ చేశారు. అనంతరం గిరిపైకి మెట్ల మార్గాన చేరుకుని, స్వామిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో సోమేశ్వరుని రథోత్సవం



మురమండలో సోమేశ్వరుని రథోత్సవం

కడియం: మురమండలోని సర్వకామదాంబ సమేత సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం వైభవంగా జరిగింది. గ్రామస్తులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు. మేళతాళాలు, భాజాభజంత్రీలు, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య గ్రామంలోని ప్రధాన వీధుల్లో రథోత్సవం జరిగింది. కాగా.. ఆలయ అర్చకుడు బాదంపూడి బుచ్చయ్యలింగం ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు.

చట్టాలపై అవగాహన అవసరం

కడియం: ప్రతి మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని డీఆర్‌డీఏ ఏపీఎం శ్యాంసుందర్ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శ్యాంసుందర్ మాట్లాడుతూ మహిళల హక్కుల రక్షణకు పలు చట్టాలు ఉన్నాయన్నారు.

గ్రాసిం ఇండస్ట్రీస్‌తో గ్రామాల్లో మహర్దశ

- రూ.12 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు
- సురక్షిత తాగు నీరు, కల్చరల్ యాక్టివిటీ భవనాలకు పెద్దపీట

అనపర్తి/బిక్కవోలు: రాష్ట్ర అభివృద్ధికి పరిశ్రమల ఏర్పాటే మంత్ర దండంగా భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలభద్రపురంలో గ్రాసిం ఇండస్ట్రీస్ ప్రారంభించారు. నాటి నుంచి గ్రాసిం ఇండస్ట్రీస్ స్థానికులకు ఉద్యోగాల కల్పనతో పాటు స్థానిక ప్రజల కోసం సేవా కార్యక్రమాల్లోను ముందంజలో ఉంటుంది. గ్రాసిం రంగప్రవేశంతో నియోజకవర్గానికి మహర్దశ పట్టిందంటే అతిశయోక్తి కాదు. సదరు పరిశ్రమ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులతో పెదపూడి, బిక్కవోలు, అనపర్తి, రంగంపేట మండలాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా సుమారు రూ.12 కోట్లు వెచ్చించి వివిధ ప్రజోపయోగ కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

వరుసగా సేవా కార్యక్రమాలు

నియోజకవర్గ పరిధిలోని కొమరిపాలెం, పందలపాక, రంగాపురం, ఇలపల్లి, బలభద్రపురం, బిక్కవోలు, ఊలపల్లి, కొంకుదురు, ఆరికరేవుల, కాపవరం, వడిశలేరు, బాలవరం, ఈలకొలను, దొంతమూరు, సింగంపల్లి, అనపర్తి, పెదపర్తి, పెదపూడి తదితర గ్రామాల్లో స్థానిక ప్రజల అవసరాలకు వాడుకునేలా 36 సాంస్కృతిక భవనాల్ని(కల్చరల్ యాక్టివిటీ సెంటర్స్) నిర్మిస్తున్నారు. ఒక్కో దానికి సుమారు రూ.33 లక్షలు ఖర్చు చేస్తున్నారు. వీటిలో కొన్ని ఇప్పటికే పూర్తి కాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. బలభద్రపురం గ్రామ పరిధిలో జగనన్న కాలనీలో లబ్ధిదారుల కోసం సుమారు రూ.50 లక్షల ఖర్చుతో పల్లంలో ఉన్న భూమిని మెరక చేసి చదును చేయించారు. బలభద్రపురం రైల్వే ఫ్లెఓవర్ బ్రిడ్జి మరమ్మతుల పనులు చేపట్టడంతో పాటు బాలవరం-బలభద్రపురం రోడ్డులో సోలార్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. బలభద్రపురం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. బిక్కవోలు తహసీల్దార్ కార్యాలయ భవనం ఆధునికీకరణతో పాటు బిక్కవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బలభద్రపురం పంచాయతీ కార్యాలయాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. అనపర్తి అగ్నిమాపక కేంద్రంలో వసతిగృహ అభివృద్ధి పనులు చేశారు. అనపర్తి నియోజకవర్గ పరిధిలో సుమారు 104 మంది క్షయ రోగులను ఎడాప్ట్ చేసుకుని వారికి ప్రతి నెలా పౌష్టికాహారం అందజేస్తున్నారు.

సురక్షిత తాగునీరందించే లక్ష్యంతో...

సురక్షిత తాగునీరు అందించే లక్ష్యంతో నియోజకవర్గంలోని రంగంపేట మండల పరిధిలోని నల్లిమిల్లి, వీరంపాలెం గ్రామాల్లో డ్రింకింగ్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. బాలవరం, దొంతమూరు, బలభద్రపురం గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకుల్ని నిర్మిస్తున్నారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్‌లో భాగంగా రంగంపేట మండలం దొంతమూరులో కుట్టు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. బలభద్రపురం సమీప గ్రామాల్లో యువతకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇప్పిస్తున్నారు. కోవిడ్ సమయంలో సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా సుమారు 18 నెలల పాటు అనపర్తి నియోజకవర్గ పరిధిలో అన్ని గ్రామ పంచాయితీలకు బ్లీచింగ్ పౌడర్ పంపిణీ, సుమారు 40 గ్రామాల పరిధిలో పారిశుధ్య నిర్వహణకు గాను నిధులు మంజూరు చేశారు.



బలభద్రపురంలోని గ్రాసిం ఇండస్ట్రీస్



బలభద్రపురంలో జగనన్న కాలనీ కోసం మెరక చేసిన స్థలం



బలభద్రపురంలో నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్

గ్రాసింతో మా గ్రామం అభివృద్ధి



ఒకపక్క ప్రభుత్వ సంక్షేమ పథకాలకు తోడు గ్రాసింత ఇండస్ట్రీ చేపడుతున్న సేవా కార్యక్రమాలతో మా గ్రామం అభివృద్ధి చెందుతోంది. పైగా ఇండస్ట్రీ కారణంగా మా గ్రామానికి రూ.55 లక్షలు పన్నులు రూపంలో రావడంతో మరింత అభివృద్ధికి ఆస్కారమేర్పడుతుంది.
– బుంగా రామారావు, సర్పంచ్, బలభద్రపురం

సేవా కార్యక్రమాల్లో ముందంజ



గ్రాసిం ఇండస్ట్రీ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులతో నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతోంది. కల్చరల్ యాక్టివిటీ సెంటర్స్, తాగునీటి ట్యాంకుల నిర్మాణంతో పాటు స్థానిక యువతకు ఉద్యోగ వకాశాలు కల్పించడంలో ముందుంటున్నారు.
– సత్యంశెట్టి వెంకటరమణ, సర్పంచ్, కాపవరం గ్రామం

కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో వైద్యసేవలు

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో సోమవారం రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో సాధారణ వైద్య శిబిరం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సత్యం రమేష్ బాబు, డాక్టర్ యన్నమనేని రామచంద్రరావు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ టీవీ సుబ్బారావు తదితరులు 270 మందికి వైద్యసేవలు అందించారు. రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో 190 మందికి వివిధ పరీక్షలు చేశారు. పరమహంస యోగానంద కంటి వైద్యశిబిరంలో 80 మందికి నేత్ర పరీక్షలు జరిపారు. వారిలో 15 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించి, ఉచిత ఆపరేషన్ల కోసం ఆసుపత్రికి తరలించారు.



కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, యన్నమని వెంకట నారాయణ, ఎం.నరసింహారావు, గద్దె బ్రహ్మన్న, విమలాదేవి, కమల కుమారి, చంటిబాబు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆడపిల్లలే ఇంటికి వెలుగు

అనపర్తి: ఆడపిల్లలను చిన్నచూపు చూడొద్దని, ఆడపిల్లలే ఇంటికి వెలుగని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రామవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బేటి బచావో... బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. రామవరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.ఛాయాదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆడపిల్ల ఇంటికి వెలుగని, అటువంటి ఆడపిల్లలను గర్భస్థ దశలోనే తుంచేయడం సరి కాదన్నారు. ఆడపిల్లల చదువు సమాజానికి మేలుకొలుపు వంటిదని చెప్పారు. రామవరం బ్రాంచి పోస్ట్ మాస్టర్ ఎం.శ్రీనివాసరావు సుకన్య సమృద్ధి యోజన పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రామవరం పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సుకన్య, ఎంపీటీసీ నల్లమిల్లి భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ గొలుగూరి గౌతమి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

కాలం చెల్లిన కూల్ డ్రింక్ విక్రయం

రాజానగరం: కాలం చెల్లిన కూల్‌డ్రింకులు విక్రయిస్తున్న దుకాణ దారుడిపై కొనుగోలుదారులు తిరగబడ్డారు. పోలీసులు రంగప్రవేశం చేసి వాటిని సీజ్ చేశారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వచ్చి, ఆరోపణలు నిజమని చెప్పడంతో ఆ వ్యాపారిపై కేసు నమోదుచేశారు. రాజానగరంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇవి.. స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్ రోడ్డులోని కోదండ రామాలయం పక్కనే ఉన్న బృందావనం ఫ్యామిలీ రెస్టారెంట్‌లో కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ విక్రయిస్తున్నారు. సాధారణంగా కొనుగోలు చేసే వ్యక్తులు వాటిపై ముద్రించి ఉన్న ఎక్స్‌పైర్ డేట్ చూడరు. సమీపంలోనే బ్రాందీ దుకాణం కూడా ఉండటంతో వారి విక్రయాలు జోరుగానే సాగుతుంటాయి. అయితే మురారికి చెందిన ఒక వ్యక్తి ఆదివారం రాత్రి కూల్ డ్రింక్ కొనుగోలు చేసి, అనుకోకుండా ఎక్స్‌పైర్ డేట్ చూడటంతో ఈ భాగోతం బయటపడింది. విషయం తెలుసుకున్న స్థానికులు కూడా ఆ వ్యక్తికి మద్దతుగా నిలిచారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి, కాలం చెల్లిన 750 ఎంఎల్, ఒక లీటరు సామర్థ్యంతో ఉన్న 90 కూల్ డ్రింక్స్ బాటిళ్లను గుర్తించారు. విషయం తెలుసుకున్న రాజమహేంద్రవరం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రుక్కయ్య అండ్ టీమ్ అక్కడకు వచ్చింది. ఆ బాటిల్స్‌పై ఎక్స్‌పైర్ డేట్ జనవరి 19, 2022గా ముద్రించి ఉంది. దీనితో ఆ బాటిళ్లను సీజ్ చేసి, వ్యాపారి ఎం.నాగరాజుపై కేసు నమోదు చేశారు. సాధారణంగా కూల్ డ్రింక్స్‌ని డీలర్ వద్ద కొనుగోలు చేస్తే రూ.5 కమీషన్ వస్తుంది. కాలం తీరిన వాటిని ఇలా బయట నుంచి కొంటే ఒక్కో బాటిల్‌కి రూ.25 వరకు మిగులుతుంది. ఇదే వ్యాపారి గతంలో సమయం మించిపోయిన డాబర్ అనే గ్లూకోజ్‌ని కూడా ఇలాగే విక్రయాలు సాగించాడు.

వైభవంగా రంగనాథస్వామి కల్యాణం

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి అనుబంధ దేవాలయమైన రంగనాథస్వామి ఆలయంలో సోమవారం రంగనాథస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. నారసింహుని కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఈ కల్యాణం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ 7.30 గంటలకు ఘనంగా కల్యాణోత్సవం జరిగింది.

గజవాహనంపై నరసింహుడు

లక్ష్మీనరసింహస్వామి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు సోమవారం రాత్రి 9 గంటలకు గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది. ఉత్సవాల సందర్భంగా కొండపై వరకూ ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. స్వామివారి కల్యాణ మండపంలో రాత్రి 7 నుంచి 9 గంటల వరకూ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. జగ్గంపేటకు చెందిన ముళ్లపూడి విజయలక్ష్మి కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది.



రంగనాథ స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నేడు చక్రతీర్థం, ఊంజల్ సేవ

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్థానిక దేవునికోనేరులో చక్రతీర్థం నిర్వహిస్తారు. లక్ష్మీనరసింహస్వామి, అనంత పద్మనాభస్వామి, చక్రపెరుమళ్లస్వామివార్లను పల్లకీపై తీసుకొస్తారు. రాత్రి 9 గంటలకు శేషవాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరుగుతోంది. కార్యక్రమాల్లో దేవస్థానం ట్రస్టీ ఫౌండర్ ఎస్‌పీ రంగరాజ భట్టర్, పరాశర లక్ష్మీనరసింహ భట్టర్, అన్నవరం దేవస్థానం ట్రస్టీ మెంబర్ తాడి రజనీరెడ్డి, అన్నవరం దేవస్థానం సూపరింటెండెంట్ వాసు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు తాడి హరిశ్చంద్ర ప్రసాదరెడ్డి, బొరుసు బద్రి, వాకా నరసింహారావు, బొండాడ చందు, నేతుల చిన్ని, అర్చక స్వాములు పాణింగపల్లి పవన్‌కుమార్, పెదపాటి గిరిధర్ పాల్గొన్నారు.



గజవాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నం

సీతానగరం: మండలంలోని ఇనుగంటివారిపేటకు చెందిన దార్ల బ్రహ్మం సోమవారం మధ్యాహ్నం 4 గంటలకు వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న ఎస్సై కె.శుభశేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని బ్రహ్మంతో మాట్లాడారు. ఆయన హామీ మేరకు బ్రహ్మ కిందకు దిగివచ్చాడు. రైతు భరోసా కేంద్రం, సచివాలయానికి ఎలక్ట్రికల్ వర్క్ కాంట్రాక్ట్ తీసుకున్నానని బ్రహ్మం తెలిపాడు. షాపులో రూ 1.60 లక్షలు ఇవ్వాలని, సర్పంచ్ తనకు సంబంధం లేదంటున్నారని ఆరోపించాడు. దీంతో ఎలక్ట్రికల్ షాపు యజమానిని రప్పించి ఆరా తీయగా, డబ్బుల విషయంలో సర్పంచ్‌కు, తనకు సంబంధమని, బ్రహ్మంతో సంబంధం లేదని లిఖిత పూర్వకంగా తెలియపర్చాడు. దీనితో దార్ల బ్రహ్మంపై ఎస్సై శుభశేఖర్ ఆత్మహత్యాయత్నం కేసు నమోదు చేశారు. డబ్బుల విషయంలో ఎలక్ట్రికల్ షాపు యజమానితో మాత్రమే తనకు లావాదేవీలు ఉన్నాయని సర్పంచ్ సత్యం రాంపండు తెలిపారు.



బ్రహ్మంతో చర్చిస్తున్న ఎస్సై శుభశేఖర్

గడువుకన్నా ముందుగానే అర్జీల పరిష్కారం

రాజమహేంద్రవరం సిటీ: అర్జీదారులు తృప్తి చెందేలా స్పందన ఫిర్యాదులను నిర్దేశించిన గడువు కన్నా 24 గంటల ముందుగానే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 21 అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మొత్తం అర్జీలను ఆరు కేటగిరీలుగా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఏ కారణం చేతనైనా స్పందన అర్జీని ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పరిష్కరించకపోతే.. సంబంధిత అధికారిపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. 94 శాతం వలంటీర్ల హాజరు నమోదు కావడంపై అధికారులను అభినందించారు. కార్యక్రమంలో అదనపు డిప్యూటీ కమిషనర్ పీఎం సత్యవేణి, సీపీ జె.సూరజ్ కుమార్, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు పాల్గొన్నారు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్

ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు గాయాలు

కంబాలచెరువు: స్థానిక దానవాయిపేట గానుగ వీధిలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ట్రాఫిక్ కానిస్టేబుల్ వెంకట్రావుకు గాయాలయ్యాయి. దీనిపై ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఆదివారం రాత్రి విధులు పూర్తిచేసుకుని ఇంటికి వెళుతుండగా ఎదురుగా వచ్చిన మరో మోటారు సైకిల్, వెంకట్రావు ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ఘటనలో వెంకట్రావుకు స్వల్ప గాయాలయ్యాయి.

ఉపాధి లక్ష్యం 83 శాతం పూర్తి

- కలెక్టర్ మాధవీలత
- అధికారులతో సమీక్ష

సీటీఆర్ఐ: మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 59 లక్షల పనిదినాలకు గాను 83 శాతం మేర లక్ష్యాలను పూర్తి చేశామని కలెక్టర్ మాధవీలత అన్నారు. మిగిలిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ వీసీ హాలు నుంచి సోమవారం సాయంత్రం ఉపాధి హామీ, వైఎస్సార్ పెన్షన్ కానుక, రబీ ధాన్యం కొనుగోలు, వ్యవసాయ యంత్ర సేవాపథకం, గ్రామ, వార్డు సచివాలయాలు, స్పందన అర్జీల పరిష్కారం, ఎపిక్ కార్డ్, 6బీ ఫారం, ఆధార్ అనుసంధానం వంటి అంశాలపై జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఒకటినే పింఛన్ పంపిణీ పూర్తికి చర్యలు

కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే నెలల్లో జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ పంపిణీని ఒకటో తేదీ ఉదయం 6 గంటలకే ప్రారంభించి సాయంత్రానికి పూర్తి చేసేలా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు చర్యలు చేపట్టాలన్నారు. మార్చిలో 2,36,251 మందికి గాను 2,34,125 మందికి 99 శాతం పంపిణీ చేశామన్నారు. జిల్లాలో వైఎస్సార్ యంత్ర సేవాపథకం అమల్లో భాగంగా 273 సిహెచ్‌సీ గ్రూపులు లక్ష్యానికి గాను 146 గ్రూపులను ఎంపిక చేసి, బ్యాంకు ఖాతాలను ప్రారంభించారన్నారు. రబీ పంటకు సంబంధించి రాజమహేంద్రవరం డివిజన్లో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లోనూ, కొవ్వూరు డివిజన్ సంబంధించి తాళ్లపూడి, చాగల్లు మండలాల్లోనూ ముందస్తుగా కోతలు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, గన్నీబ్యాగ్‌లు తదితర అంశాలకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో 15,52,333 మంది ఓటర్లకు గాను 12,05,701 మందికి ఆధార్ అనుసంధానం 77 శాతం చేయడం జరిగిందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ జి.నరసింహులు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత తదితరులు

దరఖాస్తుల ఆహ్వానం

ప్రకాశం నగర్: పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ విభాగంలో ఫీల్డ్ ఆఫీసర్లు, తపాలా ఏజెంట్ల నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్టు పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగదిత్య కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేయడానికి విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు అర్హులన్నారు. తపాలా ఏజెంట్లుగా 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు కలిగి, పదో తరగతి పాసైన స్త్రీ, పురుషులు కావాలన్నారు. వారు కేటాయించిన ప్రాంతాల్లో జీవితా బీమా మార్కెటింగ్, వినియోగదారుల సేవలు అందించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి కలవారు ఈనెల 11 లోపు దరఖాస్తులను పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం, విశాఖపట్నం అనే చిరునామాకు పంపించాలని కోరారు. మరిన్ని వివరాలకు 94418 65857, 0891 – 2546204 నంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యార్థులను ప్రణాళికాబద్ధంగా చదివించాలి

రాజమహేంద్రవరం రూరల్: పది విద్యార్థులను పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా చదివించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఉపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక ఆల్కాట్‌తోటలోని సత్యసాయి గురుకులం ఆడిటోరియంలో సోమవారం జిల్లాలోని 19 మండలాలకు చెందిన పదో తరగతి తెలుగు, గణితం ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత మండలాల వారీగా ఇప్పటి వరకూ ఉన్న విద్యార్థుల స్థితిగతులు, స్థాయిలపై సమీక్షించారు. వెనుకబడి ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రత్యేక తరగతులల్లో కూడా కేవలం చదివించడమే కాకుండా, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలన్నారు. మాదిరి ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్, జవాబులు రాసే బుక్‌లెట్‌పై విద్యార్థికి అవగాహన కల్పించాలన్నారు. 9వ తేదీ నుంచి ప్రీ పబ్లిక్ పరీక్షలను అత్యంత కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎం.తిరుమలదాస్, సత్యసాయి గురుకులం ప్రిన్సిపాల్ గురయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం

ప్రాజెక్టు రిపోర్టుపై అవగాహన అవసరం

రాజానగరం: బ్యాంకుల నుంచి రుణాలను పొందాలనుకుంటే.. దానికి అవసరమైన ప్రాజెక్టు రిపోర్టుపై లబ్ధిదారుడికి పూర్తి అవగాహన ఉండాలని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా – మరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్టు డెవలప్‌మెంట్ పీఓ శ్రీనివాస్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం మండలంలో ఎంపిక చేసిన 38 మంది మహిళ పారిశ్రామికవేత్తలకు ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఈడీపీ) జరిగింది. వ్యాపారాభివృద్ధికి కావాల్సిన ప్రణాళికలు, ప్రాజెక్టు రిపోర్టు తయారీ విధానంతోపాటు వ్యాపారానికి అవసరమైన పత్రాలు, లేబర్ లైసెన్స్, పాన్‌కార్డు, జీఎస్టీ మున్నగు వాటికి ఏవిధంగా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. సమావేశంలో డీపీఎం ఎల్‌హెచ్ బి.హేమంత్, ఏపీఎం హేమనాగలక్ష్మి, సీసీలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బూరుగుపూడి ప్రీమియర్ లీగ్

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి ఊరచెరువు సమీపంలోని మైదానంలో బూరుగుపూడి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు రెండోరోజు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ ఈ పోటీలను ప్రారంభించిన సంగతి తెలిసిందే. తొలిమ్యాచ్‌లో చక్రద్వారబంధం1 – రఘుదేవపురం తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న రఘుదేవపురం 10 ఓవర్లకు 64 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన చక్రద్వారబంధం1 జట్టు 9 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసి విజయం సాధించింది. చక్రద్వారబంధం 2తో జరిగిన మ్యాచ్‌లో నిడిగట్ల విజయకేతనం ఎగురవేసింది. నిర్వాహకులు ఏడిద పండు, పిల్లి క్రాంతి, కుందేటి కిశోర్, బత్తిన నాని, పిల్లి సుధీర్, పలివెల బన్ను, ఉపాటి నాగేంద్ర తదితరులు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రంగంపేట: ఈలకొలను విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జగ్గంపేట విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని ఈలకొలను, అచ్యుతాపురం గ్రామాలకు, వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.